


# అభోగి

"శ్రీ విరించి"

కథ వ్రాసి చాలా కాలం అయింది. ఈమధ్య ఎవరు కనిపించినా బొత్తిగా కథ వ్రాయడం లేదేం—అని అడుగుతున్నారు. కథ రాయక పోవడానికి ఓ కథకూడా వుంది. అదంతా చెప్పి అందర్నీ విసిగించడం కంటే, ఓ కథ వ్రాసి పడేసి కొన్నాళ్లపాటు విశ్రాంతి తీసుకుందాం—అనుకున్నాను.

కథ వ్రాయడం కోసం కూర్చున్నాను. ఆదివారం ఉదయం. ఈ రోజు ఆఫీసు పనిలేదు. ఆగొడవ లేదు. రోజంతా కులాసాగా హాయిగా గడిపేయవచ్చు. కాని కథ వ్రాయడం కోసం బల్లదగ్గర కూర్చుంటే బోలెడు వ్యథతో మనస్సంతా బరువుగా భారంగా బాదరబందీగా అనిపిస్తుంది. అలా అనిపిస్తుందని అనిపిస్తుంది.

కథ వ్రాయాలంటూ కథ వ్రాయడంలో 'ఆర్ట్' లేదు. ఉట్టి 'టాక్ట్'. ఆ టాక్ట్ అయినా పాతది, బొత్తిగా పనికిరానిది. అంచేత కథ వ్రాయాలి. తప్పదు.

ఏమీ తోచనప్పుడు ఆలోచిస్తూ కూచుంటే కథ వ్రాయడం ఎంతోతేలిగ్గా సుళువుగా అయ్యే పనిలా అనిపిస్తుంది. తీరా వ్రాయడానికి కూర్చుంటే జరాసంధుడి శరీరం రెండుగా చీలుతుంది.

అందరికీ తెలిసిన విషయాలు అందంగా కూరుస్తే పసందైన కథ అవుతుంది.

అందరికీ యక కొందరికే తెలిసిన విషయాలు పొంది అమరుస్తే సెభాషయిన కథ అవుతుంది.

అందరికీ తెలియని విషయాల మీద కథలు అందరికీ చేతకావు, అర్ధంకావు, చెల్లుబడికావు. శిబి చక్రవర్తి రాజ్యంలో తూకం వేసుకు అమ్ముకోడం ఒకటే మార్గం.

—ఆకాశం ఎలా వుందో ఎవరికీ తెలియదు. అప్పుడు ఉదయం కనుక ఎలా వున్నా ఎవరికీ అక్కర్లేదు. సాయంత్రాలు మటుకు ఆకాశం నిర్మలంగా వుంటే చాలు. వెన్నెల రాత్రుల్లో చుక్కలు మిణుకు మిణుకు మంటూ వుంటే అదే పదివేలు అందుకని, ఆలోచిస్తూ ఆకాశం వంక చూడడం తప్పించుకున్నాను.

అవసరానికి ఆదుకొంటున్న మిత్రుడిలాగ ఆత్రంగా సూర్యుడు పరుగెత్తుతూ వుంటాడు. ఎవరికీ అక్కర్లేని మిత్రుడు. అయినా వాడికా విషయం తెలీదు. ప్రపంచం అంతా తనమీదనే, తనకోసమే నడిచి పోతోందనుకుంటాడు. ఎదుర పడేవాళ్లు, పక్కసందుల్లో ముఖం తిప్పుకు నడుస్తున్నా, వదిలి పెట్టకుండా అనుసరిస్తాడు.

ఎనిమిది గంటలయింది. తెల్లవారి రెండు గంటలు వృధా అయినాయి. మరి రెండుగంటలు గడిపేస్తే భోజనం చేసి కులాసాగా నిద్రపోవచ్చు. ఈ రెండు గంటల లోనే కథ గిలికి పారేయాలని సంకల్పం. అంతాకాకపోయినా కనీసం నోట్సున్నా వ్రాసుకోవాలని కుండలీకరణాల మధ్య భావన.

మనసులో ఆలోచనలు నిలవవు. గుర్తు లేకుండా, దారి తెన్ను తెలియకుండా ఎటెటో ఉరుకులు తీస్తాయి. వాటి వెనగ్గా పరుగెత్తి పట్టుకోవడానికి శరీరంలో వోపిక లేదు. మనస్సులో బలం లేదు. ఈ అలుసు చూచుకునే అవి అలా పరుగులు తీస్తున్నాయి.

నీలగిరి కొండలయితే చల్లగా వుంటాయని, కథ జోరుగా పరుగెత్తుకు పోతుందని అక్కడికి తీసుకువెళ్లి కూర్చున్నాను మనసుని. చలి, వణుకు, బెదురు, భయం. అక్కడినించీ కదలటానికి లేదు. మనుషులు అక్కడే వున్నారు. వాళ్ల చర్యలు రికార్డు చేసుకోవాలి. అందుకే యింత దూర ప్రయాణం.

వెచ్చదనం కోసం, వూపిరికోసం కాఫీ పుచ్చుకున్నాను. గుటకలు మింగాను.

గాలివానలాగ ఉధృతంగా కొన్నిభావాలు. ఉక్కిరి బిక్కిరి. అర్ధంకాని ఆందోళన. వీటిని కాగితం మీద పెట్టటానికి పరిశ్రమ. అక్కడ నిలిపితే కాని వాటికి పరిపూర్ణత రాదు. నలుగురికీ తెలియదు. చదవడానికి వీలుకాదు.

జీవితంలో యింకేమీ కోరికలు మిగలని భర్త, ఆధ్యాత్మిక సంపద కోసం తాపత్రయ పడుతున్నాడు. ఆత్మతో సంబంధం లేని యే వస్తువా అతనికి అక్కర్లేదు. ఆత్మపదార్ధం కోసం దాదాపు అతను 'రిసెర్చి' చేస్తున్నాడు. ఒకసారయినా తనను తాను 'సెర్చి' చేసుకోకుండా 'రిసెర్చి' మొదలెట్టాడు. అందుకనే అతనికంత కష్టం అయింది. నికృష్టం అయింది పరిస్థితి.

నిలువు టద్దం ముందు నిలుచున్నాడు. ఏం కనిపిస్తుంది? ఏ వికారాలు లేని వాడికి తన

ఆకారం కనిపిస్తుంది. తన ఆకారం తప్ప యింకేం కనిపించదు: కాని అతనికి ఆత్మ కనిపించింది. ఇది మొదలు కాదు, ఇలా కొన్ని సంవత్సరాల నుంచి అభ్యాసం చేస్తో వచ్చాడు. ఆత్మ పదార్థంతో తప్ప మరోదాంతో మాట్లాడనని, చూడనని, చెప్పననీ, అందువల్ల అతనికి పటిష్టంగా, స్పష్టంగా అగుపిస్తుంది. ఆత్మతో కొంతసేపు సంభాషిస్తాడు. తన కార్యక్రమం నిర్ణయించు కుంటాడు. అలా చేస్తాడు.

అంతేకాని భార్య చెప్పినట్లు చేయడు. భార్య ఎన్నో చెబుతుంది. తన బాగుకోసం, ఆమె బాగుకోసం, యిద్దరి సమిష్టి బాగుకోసం—మరీన్నీ లోక కళ్యాణం నిమిత్తం ఎన్నోసంగతులు చెబుతుంది. ఇవన్నీ అతను సరుకు చేయడు. భార్యను 'ఎనలైజ్' చేయగా తన సుఖం, తమ సుఖం కనిపిస్తాయి. ఎందుకవి ? ఎందుకోసం ? కేవలం సుఖంకోసం!ఎందుకు జీవితం ? కొన్నాళ్ళ సుఖపడి పోవడమే యీ జీవిత లక్ష్యం అని భార్య అనుకుంటే—అందుకు తన తప్పేమీ లేదనుకుంటాడు. తాను చేయగలదేమీ లేదనుకుంటాడు.

నీలగిరి కొండల్లో భార్య సుఖంకోసం మకాం పెట్టించింది. ఇప్పుడే కాదు, ప్రతిసారీ తమ సుఖంకోసం తాపత్రయ పడుతుంది. తనను సుఖపెట్టటం కోసం, తనతో పోట్లాడటానికయినా సాహసిస్తుంది. కాని, ఎందుకు తనకు —అనిపిస్తుంది, జీవితాన్ని తన సిద్ధాంతంతో కొలిచి, తూకంవేసి, ధర కడితే.

భార్య అద్దం ముందు నిలబడింది. తన ముఖం, శరీరం కనిపించాయి. దబ్బపండులా పచ్చగావుంది తను. నుదుట కుంకం, కళ్లకు—చేపల్లా అందంగావున్న కళ్లకు—లేత కాటుక, స్థూలంగా చూచుకుంటే తను అచ్చం లక్ష్మీదేవిలా వుంటుంది. చిన్నప్పుడు—అంటే, యింకా పెళ్లికాక, జీవితంలో రెండోమనిషి జతపడక, పుట్టింట్లో వరూధినిలా వరుడికోసం ఎదురు చూస్తో కూర్చున్నప్పుడు—బొమ్మ అనే ముక్కలు గుర్తువస్తాయి. ఎప్పుడు అద్దంముందు నిలుచున్నా. తనకేం, అచ్చం లక్ష్మి లావుంది. సందేహం లేదు. చచ్చి యేలోకాన వున్నదోగాని—మనుషులకు పునర్జన్మ వుంటే ఆమె యీ లోకానికే వస్తుంది—అయినా యీ ప్రశ్న తనని యిప్పుడు బాధించదు—బొమ్మ ముచ్చటగా మూడు ముక్కలు అనేది. తన చెక్కిళ్లు నొక్కి, చెంపలు ముద్దు పెట్టుకునేది. తనస్వంత చేతులతో అలంకారాలు చేసి హాయిగా సంతోషంగా తృప్తిగా నవ్వి తేలిగ్గా అనేసేది.

అందుకనే ఆముక్కలు తనకు యింకాగుర్తు వున్నాయి. ఇంకా వుంటాయి. తను వున్నన్నాళ్ళూ అలా జ్ఞాపకం వుంటాయి.

ఇద్దరికీ తమ కలల్లో కలకలలు, కలవరాలు కళకళలాడాల్సిన జీవితాన్ని గురించి కలవెలపాటు, కంగారు.

—ఇంత దూరం వచ్చాక ఆకస్మాత్తుగా తల యెత్తి చూడాల్సి వచ్చింది. కథనక్కడే వదిలి, కదిలిపోవాల్సి వచ్చింది. ఎదురుగా మనిషి నిలుచుంటే మనసు తుర్రుమంటుంది—పన్నెండేళ్ల కొత్త కన్నియలా సిగ్గు తెరల్లోకి.

'చాల రోజులయింది, చూచి పోదామని వచ్చాను' అన్నాడు.

చూచినవాడు చూడకుండా పోవచ్చును. కాని అలా పోడు. ఎందుకు వచ్చాడో నాకు తెలుసు. అయినా పైకి చెప్పడు. గాంభీర్యం. అరగంట గడిస్తేగాని అసలు విషయం బయటపెట్టడు. అనవసరమైనవి ముందు మాట్లాడి, తరువాత అవసరాల సరాలకు దిగుతాడు.

తప్పనిసరి అయిన పనులు చేయాల్సివచ్చినప్పుడు పెట్టే ముఖంతో 'కూచో' అన్నాను. అంతకు ముందే కూచున్నాడు. బల్లమీది కాయితాలు కెలుకుతున్నాడు, అప్పుడే స్వరాజ్యం వచ్చిన పౌరుడిలా.

మాట్లాడితే తప్ప త్వరగా వదిలిపోడని 'యేమిటి విశేషాలు' అన్నాను.

'ముందు సశేషాలు తరువాత విశేషాలు, వ్యాఖ్యానాలు. . .పంజాబ్ రాష్ట్రంలో పాకీవాళ్ల నేషనల్ సేవింగ్స్, ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ వాళ్ల కల్లోలాలు, కేరళంలో గరళం—యిలా ఆసేతుశీతనగం, తాను పూర్వం కనిపించినప్పటి నుంచి యిప్పటి వరకు జరుగుతున్న సంగతులన్నీ యేకరువు పెట్టాడు. ఇవన్నీ నాకూ తెలుసునని అతనికీ తెలుసు. కాని అతని మార్కు వ్యాఖ్యానలతో చెప్పుకుపోతున్నాడు. కుతూహలం నటిస్తో వింటున్నాను. వార్తలను మింగే ఘటోత్కచుడిలా చెప్పుకుపోతున్నాడు. బకాసురుడిలా బండెడు సంగతులు వేసుకు వచ్చాడు కాబోలని భయపడ్డాను.

'ఒంట్లోబాగా లేదు. ఓపికలేదు' అన్నాను వాందిగా.

'అన్ని అస్వస్థతలకు మూలం మలబద్ధం. విరేచనం సాఫీగా అవుతోందా ?' అన్నాను. ఏం జవాబు చెప్పను ?

'అసలు వాతావరణంలో మార్పే దీనికంతటికీ కారణం. అన్ని యిళ్లలోనూ జబ్బు మంచాలే. మాయింట్లో మంచాలు తప్ప నేల కనబడడం లేదు. వంటి కుర్రాడు మొదలు యింటావిడ వరకు అయిదుగురూ తలా ఒక మంచం వేసుకు పడుకున్నారు. నేను యీ గొడవ పడలేక డాబా మీద పడుకుంటున్నాను' అన్నాడు.

హ్యూమర్ అర్థంకాక నవ్వకుండా కూర్చున్నాను. నా వంతుకూడా అతనే నవ్వుతున్నాడు. నన్ను యిలా ఉల్లాసం వైపు డ్రైవ్ చేయడం కోసం అతను యింకా చెప్పుకుపోతున్నాడు. నాకథను గురించి ఆలోచిస్తూ మనస్సుని ముందే ఆవరించుకుకూర్చున్నాను గనుక నా కాసంగతులేమీ అంటటం లేదు.

ఈ పరిస్థితి చాలా లేటయినా, కొంతసేపటికి అతను గమనించాడు.

'నాకొక చిన్న సహాయంచేసి పెట్టాలి' అన్నాడు, చివరకు.

ఈ చిన్నసహాయం నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు. అయినా యేమిటన్నట్లుముఖంపెట్టాను

'చెప్పాను కదూ—యింట్లో అందరికీ జబ్బులు. చేతిలో ఒక్క దమ్మిడీ లేదు కనీసం పది రూపాయిలైనా కావాలి. మళ్లీ నాచేతికి డబ్బురాగానే యిచ్చేస్తాను' గ్రామఫోనుప్లేటులా టకటక చెప్పేశాడు.

వినడానికి అందంగానే వుంది. నాటకంలో డైలాగులా చక్కగానే వుంది. కాని యీ చక్కటి డైలాగును — ఎప్పుడూ వినే మాటలను — పదిరూపాయల ఖరీదుకు ఎన్నిమార్లు కొనుక్కుంటాను? ఎంతకాలం భరిస్తాను.? ఎప్పటికప్పుడు తప్పించుకోవడానికి ప్రయత్నంచేసి, తప్పించుకోలేని ఆపద యిది.! నివారణ, నిరోధము చేతకాని వికారమిది! అందుచేత మామూలు ముఖం వేలవేసి అయ్యొయ్యో! ఎంత కష్టం వచ్చింది—నేనేం చేయలేకపోతున్నాను గదా— అన్న భావానికి ముసుగువేసి ముఖంలో ప్రవేశపెట్టి 'ఐయాం వెరీసారీ! నాదగ్గర రెండు రోజుల నుంచీ బొత్తిగా డబ్బులేదు. అందుకనే యివాళ ఆదివారం కదా, తీరుబడిగా కథవ్రాసి పదిరూపాయలు తెచ్చుకుందామనుకుంటున్నాను' అన్నాను.

అతని ముఖం నమ్మనంటోంది. కాని అదే మాటల్లోకి అనువదించకుండా 'ప్రయత్నించండి ఒక్క పదిచాలు. పోనీ — అయిదు .... ఎక్కడోక్కడ సంపాదించి యివ్వండి. ఈపూటకి కనీసం రెండు రూపాయలయినా లేకపోతే ఎట్లా? చూడండి, చూడండి—' అన్నాడు. యీబాకీ యిన్నాళ్లనుంచి తీర్చకుండా వుంటే యింకా ఎన్నిసార్లు నీయింటి చుట్టూ తిరుగుతాను, అన్న ధోరణిలో. ఈమాటలూ నాకేమీ కొత్తకాదు. గ్రామఫోను ప్లేటు రెండో పక్క తిప్పితే వస్తాయి. అందుకని ధైర్యం స్థైర్యం చిక్కబట్టుకుని 'యేం చేయను? దమ్మిడీలేదు. ఉంటే యివ్వనూ, యిదివరకెన్నడేనా అడిగితే లేదన్నానా?' అన్నాను.

'నాకు తెలుసు. మీ చేతికి ఎముకలేదు. అయినా ప్రయత్నించండి. మీపెట్టె అడుగున వెదికినా, బీరువా అంతా దులిపి. పుస్తకాల దొంతరలు కదిలించినా ఎక్కడో అక్కడ ఎనిమిదణాలయినా దొరక్కపోవు. చిల్లరడబ్బులయినా లేకుండా యింటికెళ్లి యేంచేయను?' అన్నాడు మరోమెట్టు కిందికి దిగి.

నేనింకా ఉపేక్షచేస్తే ఎనిమిదణాలుకూడా కిందికి దిగుతాయి. కాని పదిరూపాయలకు, ఎనిమిదణాలకు సామ్యం పోల్చుకుంటూ చూచి వస్తానని లోపలికెళ్లాను. చిల్లర పోగుచేస్తే ఆరణాలయింది. తీసుకొచ్చి అతని చేతిలో

వుంచుతూ 'ఆన్ వర్దీ ఆఫ్ గివింగు' అన్నాను. 'ఎక్స్‌క్యూజ్ మి' అని కూడా అన్నాను, లేనిపోని ముఖంలోకి తెచ్చుకుని.

'నో. నో. థాంక్స్. వస్తాను.' అంటూ నిష్క్రమించాడు.

బల్లమీద కాగితాలు చూచుకున్నాను.

నీలగిరి కొండలమీది చిన్న బంగళా. అతకని ఆలోచనలతో సతమతమవుతున్న అతనూ ఆమే. నిలువుటద్దం ముందు యిద్దరూ సాక్షాత్కరించారు. నీలి ప్రతిమల్లా గోచరించారు. ఆత్మసుఖం, అంతరాత్మ సుఖం సంఘర్షణ పడుతున్నాయి.

సోక్రటీసు శోకంలో మునిగిపోయాడు.

గాలికి రెపరెపలాడుతున్న లేతఆకులా ఆమె హృదయం. విచారం.

విచారంలేని విచారంతో అతను విరోధిగా తయారవుతున్నాడు. స్త్రీరత్నం ముందు అస్థిరత్వంలా, చిన్నకృష్ణుడి ముందు కంసుడుగా తయారవుతున్నాడు. ఆమె యీ పరిస్థితికి బాధపడుతోంది. భర్త ఎందుకూ కాకుండా పోతున్నాడు. తనువు, మనువు యెరక్కుండా పోతున్నాడు. ఇలా కొన్నాళ్ళ సాగితే చివరకు యేమవుతుంది? — ఇది తలుచుకుంటే ఆమె హృదయం — విచారం, విషాదం, వికారం, విరాగం—అన్నీ కలిపి చేసిన కదంబంతో బరువుగా సోలి తూలుతూంది. ఇలా జరక్కుండా 'తను యేం చేయుగలదు? ఎంతని ఆపగలదు?

అతను అద్దంలో చూస్తే ఆరోజు కొత్త సందేశం కనిపించింది. ఆత్మ మరోస్థాయి ఔన్నత్యం అందుకున్నట్లయింది. అస్థిరమైన యీ ప్రపంచానికి దూరంగా వెడుతున్నాడు తను, అతీతుడవుతున్నాడు. అందుకనే ముఖంలో కొత్త వెలుగు, వికాసం.

ఆమెకూ యీరోజే అద్దంలో కొత్తనిజం బద్దలయింది. వయసు గడిచిపోతోంది. శరీరం ఒడలిపోతోంది. తనవాడు దూరమవుతున్నాడు. తనువునే బరువుగా బాధపడుతున్నాడు. తన కోసం అతనేమీ తాపత్రయపడడు. తన తపనతో పతనమైపోతున్నాడు. తానింకా ఉపేక్షిస్తే తరువాత పరితాపపడవలసివస్తుంది. పరితాపపడినా ప్రయోజనంలేని పరిస్థితి యేర్పడుతుంది. కనుక యీరోజే తానేదో చేసివేయాలి. భర్తను తనమార్గంలో నడిపించాలి. భర్త సాన్నిధ్యం సంపాదించి సుఖప్రశాంతులు పొందాలి

తన ఆలోచనలను కార్యరూపంలో పెట్టడం ఎలాగా అని ఆమె ఆలోచిస్తోంది. కొత్తగా సున్నంకొట్టిన గదిగోడలు నిగనిగలాడుతున్నాయి. గాలి ఫంకా జోరుగా హుషారుగా తిరుగుతోంది.

పక్కగదిలో ఆయన పారమార్థికచింతతో పరమగురుచరణ సన్నిధికి దూరం కొలుస్తున్నాడు. కిటికీ రెక్కలు గాలికి అటుయిటు కదులాడుతున్నాయి. క్యాలెండరు కాగితాలు రెపరెపలాడుతున్నాయి.

—ఎవరో తలుపుతట్టి పిలిచారు. కాగితాల మీది ధ్యాస తలుపువైపు మళ్లింది. విశ్వామిత్రుడి తపస్సుకు మేనకనృత్యం భంగంకలిగించనట్లయింది.

'పన్నెండు గంటలయింది. భోజనసమయం బాగా దాటిపోయింది. వంటకాలన్నీ చల్లగా చల్లారిపోయినాయి. ఇప్పటికైనా దయచేసి—'

మెదడును శూన్యం ఆవరించింది. శరీరం బడలికతో విరుచుకుంది. అకస్మాత్తుగా గుర్తు వచ్చిన ఆకలి, అంతటా ఆక్రమించుకుంది.

నీలగిరి కొండలమీది చిన్న బంగళాలో దంపతుల కథనం పరిసమాప్తమయింది. ప్రస్తుతానికి అశేషం అయింది. ★

